క్లుప్తంగా

బీటీరోడ్డు పరిశీలన

అడ్డాకుల: మండలంలోని రాచాల బీటీరోడ్డును గురువారం పంచాయతీరాజ్ ఏఈ వేణుగోపాల్‌రెడ్డి పరిశీలించారు. రోడ్డును నాణ్యతగా వేయలేదని గ్రామస్తులు ఆరోపణ చేస్తున్న నేపథ్యంలో ఆయన రోడ్డును పరిశీలించి వివరాలను సేకరించారు. పొన్నకల్ చెరువు కట్ట నుంచి రాచాల వరకు వేసిన బీటీరోడ్డు రెన్యూవల్‌లో నాలుగు చోట్ల రోడ్డు నాసికరంగా ఉన్నట్లు గుర్తించామని ఏఈ తెలిపారు. ఉన్నతాధికారులు రోడ్డును పరిశీలించిన తర్వాత తగిన నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. నాసిరకం పనులు చేసిన చోట బాగు చేయిస్తామని తెలిపారు.

నులిపురుగులను నిర్మూలిద్దాం

మిడ్జిల్: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలకు జాతీయ నులిపురుగుల నిర్మూలనపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మనుప్రియా మాట్లాడుతు ఆకలి మందగించడం, కడుపునొప్పి, వాంతులు, విరోచనాలు తదితర లక్షణాలు కనబడుతాయని వాటి నిర్మూలన కోసం ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వాలని సూచించారు.

విద్యార్థులకు బస్‌పాస్‌ల పంపిణీ

భూత్పూర్: మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు బస్‌పాస్‌లను మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్ పంపిణీ చేశారు. మండలంలోని 200 మంది విద్యార్థుల ఆర్థిక పరిస్థితుల కారణంగా దూర ప్రాంతం నుంచి ఆర్టీసీ బస్సులో వచ్చే వారికి చైర్మన్ తన సొంత డబ్బులు బస్‌పాసులకు చెల్లించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ డిపో మేనేజర్ సుజాత, బస్వరాజ్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, మురళీధర్ గౌడ్, అహ్మద్, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

చిన్నచింతకుంట: మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు సుధాకర్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల చికిత్స పొందాడు. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి గురువారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలుశిక్ష

అడ్డాకుల: డ్రైవింగ్ లైసెన్సు లేకుండా మద్యం సేవించి ద్విచక్రవాహనాన్ని నడిపిన కేసులో ఒకరికి కోర్టు జైలు శిక్ష, జరిమానా విధించినట్లు ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపారు. అడ్డాకులకు చెందిన కుమ్మరి కొండన్న ఈనెల 1వ తేదీన జాతీయ రహదారిపై పోలీసులు చేపట్టిన తనిఖీల్లో డ్రైవింగ్ లైసెన్సు లేకుండా మద్యం తాగి బైకును నడుపుతూ పట్టుబడ్డాడు. పోలీసులు అతన్ని గురువారం మహబూబ్‌నగర్ కోర్టులో ప్రవేశపెట్టారు. ఆయనకు రెండు రోజుల జైలు శిక్ష, రూ.2,500 జరిమానా విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువతి అదృశ్యం

నవాబుపేట: ఇంట్లో అందరు నిద్రలో ఉండగా యువతి అదృశ్యమైన సంఘటన మండల పరిధిలోని కొల్లూర్‌లో చోటు చేసుకుంది. గురువారం తెల్లవారు జామున కొల్లూర్ గ్రామానికి చెందిన సున్నల లక్ష్మి (19) తల్లిదండ్రులు నిద్రలో ఉండగా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. తర్వాత తల్లి అంజమ్మ నిద్ర నుంచి లేచి చూసేసరికి కూతురు కనిపించ లేదు. వెంటనే ఆమె పోలీసు స్టేషన్‌కు వెళ్లి తమ కూతురును అప్పగించాలని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పురుషోత్తం తెలిపారు.

మహమ్మదాబాద్‌లో మరో యువతి..

మహమ్మదాబాద్: గండేడ్ మండలంలోని ఓ యువతి అదృశ్యమైన సంఘటన గండేడ్ మండలంలో చోటుచేసకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొంరెడ్డిపల్లికి చెందిన ఓ యువతి బుధవారం అర్ధరాత్రి ఇంట్లో నుంచి ఎవరికి తెలియకుండా వెళ్లిపోయింది. మెలుకువ వచ్చిన తల్లిదండ్రులు గురువారం ఉదయం కూడా వెతికారు. గ్రామంలో పరిసర ప్రాంతాల్లో ఎక్కడా కనిపించలేదు. దీంతో బంధువులకు కుమార్తె సమాచారం కోసం ఫోన్లు చేసినా.. యువతి ఆచూకి తెలియలేదని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మహమ్మదాబాద్ ఎస్‌ఐ సురేష్ తెలియజేశారు.

టీఎస్ సీపీఎస్‌ఈయూ కార్యవర్గం ఎన్నిక

మహమ్మదాబాద్: టీఎస్ సీపీఎస్‌ఈయూ మండల కార్యవర్గాన్ని గురువారం స్థానిక కార్యాలయంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా గంగయ్య, కోశాధికారిగా గోపాల్, సలహాదారునిగా సత్తయ్య, ఉపాధ్యక్షులుగా హనుమయ్య, ఓంప్రకాష్, కార్యదర్శిగా మల్లేష్, మహిళా విభాగం బాధ్యులుగా గౌరమ్మ, ఉషారాణిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో బాలస్వామి, వర్మ, హుస్సేన్, షంషేర్, ఖాదర్, కుర్మయ్య, లక్ష్మణ్, బాల్‌రామ్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు

మహబూబ్‌నగర్ రూరల్: ప్రతి పల్లెకు అభివృద్ధి ఫలాలు, ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దేనని కోటకదిర సింగిల్‌విండో చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మాచన్‌పల్లిలో సింగిల్‌విండో చైర్మన్, సర్పంచ్ మల్లికార్జున్‌రెడ్డి ఆధ్వర్యంలో వేర్వేరుగా ఇంటింటి సర్వే చేపట్టారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికీ త్వరలోనే ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షల ఆర్థిక సాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో శివకుమార్, మల్లు వెంకటేశ్వర్‌రెడ్డి, మొగులయ్య, తిరుపతి, నరేష్ పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి



జడ్చర్లలో నివాళి అర్పిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య



జిల్లా కేంద్రంలో జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

జిల్లాలో వ్యాప్తంగా బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా గురువారం విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జడ్చర్లలో ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఎమ్మార్పీఎస్, అంబేద్కర్ సంఘాల ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. దేవరకద్ర మండల కేంద్రంలోని దళితవాడలో అంబేద్కర్ భవన్ వద్ద ఏర్పాటు చేసిన జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో గల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

– సాక్షి, నెట్‌వర్క్

పంది అడ్డు రావడంతో ఆటో బోల్తా

జడ్చర్ల: రోడ్డుపై అడ్డుగా వచ్చిన పందిని తప్పించే ప్రయత్నంలో ఆటో బోల్తా పడిన ఘటన గురువారం పట్టణ సమీపంలో 167వ నంబర్ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. మండలంలోని నెక్కొండకు చెందిన సుధాకర్ తన కుటుంబంతో కలిసి ఆటోలో జడ్చర్లకు వస్తుండగా పట్టణ సమీపంలో ఓ పంది అడ్డు రావడంతో తప్పించబోయి అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో సుధాకర్‌తో పాటు అతని భార్య స్వాతి, పిల్లలు అక్షర,అరవింద్, మరో వ్యక్తి నర్సింహ గాయపడ్డారు. వీరిలో స్వాతి తీవ్రంగా గాయపడింది. చికిత్స కోసం సమీపంలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆటో బోల్తా: ఇద్దరికి తప్పిన ముప్పు

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై గురువారం రాత్రి ట్రాలీ ఆటో బోల్తాపడిన ఘటనలో ఇద్దరికి ముప్పు తప్పింది. నపర్తి జిల్లా కేంద్రానికి చెందిన జీవన్ మర్రికుంట సమీపంలో నర్సరీ నిర్వహిస్తున్నాడు. మొక్కల కోసం వనపర్తికి చెందిన జాహంగీర్ ట్రాలీ ఆటోను అద్దెకు మాట్లాడుకుని శంషాబాద్‌లో రూ.లక్ష విలువ చేసే మొక్కలను కొనుగోలు చేసి వనపర్తికి బయలుదేరారు. మూసాపేట స్టేజీ దాటిన తర్వాత లారీ అకస్మాత్తుగా అడ్డురావడంతో ఆటోను డ్రైవర్ పక్కకు తిప్పడంతో రోడ్డు కిందకు దూసుకెళ్లి బోల్తా పడింది. అందులో ఉన్న ఇద్దరు ప్రమాదం నుంచి త్రుటిలో తప్పించుకున్నారు. ట్రాలీలో ఉన్న మొక్కలు కిందపడి విరిగిపోవడంతో నష్టం వాటిల్లినట్లు జీవన్ తెలిపారు.

ట్రాక్టర్, బైకు ఢీకొని వ్యక్తి గాయాలు

మహమ్మదాబాద్: ఎదురెదురుగా వస్తున్న ట్రాక్టర్, బైకు ఢీకొనడంతో వ్యక్తికి గాయాలయ్యాయి. కోస్గి మండలం పోతిరెడ్డిపల్లికి చెందిన నరేష్ కొరియర్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఇదే క్రమంలో గురువారం సాయంత్రం మహమ్మదాబాద్ మండలం మొకర్లాబాద్ నుంచి మంగంపేట్‌కు బయలుదేరాడు. ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ తగలడంతో నరేష్‌కు గాయాలయ్యాయి. వెంటనే అంబులెన్సులో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ప్రతి మొక్కనూ బతికించాలి

గండేడ్: నాటిన ప్రతి మొక్కను బతికించుకోవాలని ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం పగిడ్యాల్, మన్సూర్‌పల్లి, బల్సుర్‌గొండ, బల్సుర్‌గొండలతండాలో నాటిన మొక్కలను పరిశీలించారు. నర్సరీల్లో పెంచిన మొక్కలను ప్రభుత్వ స్థలాల్లో, రోడ్డుకు ఇరువైపులా, కార్యాలయాల స్థలాల్లో నాటాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ హరిశ్చంద్రుడు తదితరులు ఉన్నారు.

లక్ష్యాన్ని పూర్తి చేయాలి

కోయిల్‌కొండ: హరితహారం కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో నిర్దేశించిన లక్ష్యాన్ని పంచాయతీ అధికారులు పూర్తి చేయాలని ఎంపీడీఓ జయరాములు అన్నారు. గురువారం మండలంలోని జయనగర్‌తండాలో మొక్కలను పరిశీలించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

అడ్డాకుల: మూసాపేట మండలం మహ్మదుస్సేన్‌పల్లి శివారులో పెద్దవాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్‌ఐ విజయ భాస్కర్ తెలిపారు. గురువారం తెల్లవారుజామున అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తుండగా ట్రాక్టర్‌ను పట్టుకుని దాన్ని పోలీస్‌స్టేషన్ తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఉపసర్పంచ్‌పై దాడి: కేసు నమోదు

మహమ్మదాబాద్: గ్రామానికి సంబంధించిన అభివృద్ధి పనులు చేస్తుండగా.. ఉప సర్పంచ్‌పై దాడిచేసిన ఘటన మహమ్మదాబాద్ మండలంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని గాధిర్యాల్‌కి చెందిన బసమోళ్ల రామకృష్ణ గ్రామంలో అండర్‌గ్రౌండ్ డ్రైయినేజీ పనులు చేస్తున్నాడు. ఇదే తరుణంలో అదే గ్రామానికి చెందిన బసమోళ్ల సత్తయ్య, ఆయనపై దాడిచేసి గాయపర్చగా గాయాలపాలయ్యాడు. దీంతో రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మహమ్మదాబాద్ ఎస్‌ఐ సురేష్ తెలియజేశారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి



హన్వాడలో ఉపాధ్యాయులతో డీఈఓ రవీందర్

హన్వాడ: విద్యార్థులు మెరుగైన ఫలితాలను సాధించేలా చర్యలు తీసుకోవాలని డీఈఓ రవీందర్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ ఉర్దూ మీడియంను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా వంద శాతం ఫలితాలు సాధించిన పాఠశాలను అభినందించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మాట్లాడారు. ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా సమయానుకూలంగా పాఠశాలకు వెళ్లాలని సూచించారు.

యూనిఫాం పంపిణీ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని షాషాబ్‌గుట్ట ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు యూనిఫాంను డీఈఓ రవీందర్ పంపిణీ చేశారు. డీఈఓ మాట్లాడుతూ పాఠశాలలో పచ్చదనం, పరిశుభ్రత పాటించడం మంచి విషయమని తెలిపారు.

కోయిల్‌కొండ: గ్రామాల్లో వందశాతం అక్షరాస్యతే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ రవీందర్ తెలిపారు. గురువారం ఎమ్మార్సీ కార్యాలయంలో మూసాపేట, సీసీకుంట, అడ్డాకల్, కోయిల్‌కొండలకు చెందిన హెచ్‌ఎంలో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మన ఊరు–మనబడి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, బడిబాట కార్యక్రమంలో భాగంగా 5ఏళ్లు నిండిన ప్రతి విద్యార్థి పాఠశాలలో చేర్పించాలన్నారు. పాఠ్యపుస్తకాలను, దుస్తులను వెంటనే విద్యార్థులకు పంపిణీ చేయాలన్నారు.

బ్రిడ్జి నిర్మాణానికి సహకరించాలి

అడ్డాకుల: మండలంలోని వర్నె వాగు వద్ద ఇటీవల నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను గురువారం జెడ్పీటీసీ సభ్యుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ కిషన్, రోడ్లు, భవనాలశాఖ డీఈ సంధ్య పరిశీలించారు. బలీదుపల్లి వైపు వాగు ఒడ్డున్న ఉన్న రైతు శేఖర్‌రెడ్డి వ్యవసాయ పొలంలో కొంత బ్రిడ్జి నిర్మాణం చేయనున్న నేపథ్యంలో అధికారులు, నాయకులు రైతుతో మాట్లాడారు. బ్రిడ్జి నిర్మాణం కోసం భూసేకరణకు సహకరించాలని కోరారు. తనకున్న ఎకరం పొలంలో 14, 15 గుంటల పొలంలో బ్రిడ్జి నిర్మిస్తే తనకు నష్టం కలుగుతుందని రైతు అధికారులతో వాపోయారు. ప్రభుత్వం చేపట్టే భూసేకరణతో నష్ట పరిహారం అందిస్తుందని, పెద్ద మనసుతో బ్రిడ్జి నిర్మాణానికి సహకరించాలని అధికారులు, నాయకులు కోరారు.



భూసేకరణ కోసం రైతుతో మాట్లాడుతున్న నాయకులు, అధికారులు

న్యాక్ ఆధ్వర్యంలో శిక్షణ



మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని జమిస్తాపూర్‌లో న్యాక్ ఆధ్వర్యంలో గురువారం భవన నిర్మాణ కార్మికులకు శిక్షణ ఇచ్చారు. 15 రోజుల పాటు శిక్షణ ఉంటుందని ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం

కోయిల్‌కొండ: మండలంలోని కల్యాణనగర్ తండాకు చెందిన సురేష్ అనారోగ్యంతో మృతి చెందాడు. స్థానిక ఉన్నత పాఠశాల 1997–98 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు తన తోటి స్నేహితుడు మృతిచెందిన విషయం తెలుసుకొని భార్య గంగమ్మకు రూ.45వేలు అందించారు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారని కుటుంబానికి ఏ అవసరం ఉన్న అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో పరందాములు, శ్రీనివాసులు, సురేష్, శ్రీను, రవి, రాజు, ఖాజమైనోద్దీన్, ప్రతాప్, వెంకటేశ్వర్‌రెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.

ఎల్‌డీఎం కోఆర్డినేటర్‌గా దత్తాత్రేయ

బాలానగర్: మండల కేంద్రానికి చెందిన దత్తాత్రేయ ఏబీసీ ఆధ్వర్యంలో లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ మిషన్ నాగర్‌కర్నూల్ కోఆర్డినేటర్‌గా నియమించబడినట్లు ఆయన గురువారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన పలువురికి కృతజ్ఞతలు తెలిపారు.

తపస్ సభ్యత్వ నమోదు

దేవరకద్ర: మండలంలోని చౌదర్‌పల్లి, గద్దెగూడెం పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులతో గురువారం తపస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మండల కార్యవర్గం ప్రతినిధులు నిర్వహించారు. ఆయా పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయులను సభ్యత్వ రసీదులను అందజేశారు. తిప్పారెడ్డి, సుధాకర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమ్మె



భూత్పూర్‌లో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు కిల్లె గోపాల్

జిల్లాలో గురువారం పంచాయతీ కార్మికులు సమ్మెకు దిగారు. ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ కార్మికులు ఆందోళన బాటపట్టారు. పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తామని కార్మికులు ప్రకటించారు. కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని, 8 గంటల పనిదినాలు అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పంచాయతీలో బిల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న కారోబార్‌లను పంచాయతీ సహాయ కార్యదర్శులుగా నియామకం చేపట్టాలని, మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు, రూ.10 లక్ష జీవిత బీమా సౌకర్యం అమలు, సర్పంచ్‌ల వేధింపులు అరికట్టాలని కోరారు.

– సాక్షి, నెట్‌వర్క్



నవాబుపేటలో ..



మహమ్మదాబాద్‌లో..

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్డీఓ

మహమ్మదాబాద్: మండలంలోని షేక్‌పల్లి, ధర్మాపూర్‌లో పోలింగ్ కేంద్రాలను వికారాబాద్ ఆర్డీఓ విజయకుమారి పరిశీలించారు. మండల తహసీల్దార్ ఆంజనేయులు సమక్షంలో ఆయా గ్రామాల్లో ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. ధర్మాపూర్‌లో పోలింగ్ బూత్ లేకపోవడంతో ఓటర్లంతా 4కిలోమీటర్ల దూరం వెళ్లి షేక్‌పల్లిలో ఓటు వేయాల్సి ఉండేది. వారి సమస్యను శాశ్వతంగా దూరం చేసేందుకు తహసీల్దార్ ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె గురువారం పరిశీలించారు. ఎక్కడి గ్రామాలకు అక్కడే పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.



షేక్‌పల్లిలో పోలింగ్‌బూత్‌ను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

బ్రహ్మగర్జనను విజయవంతం చేయండి



బ్రహ్మగర్జన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బ్రాహ్మణ సేవా సమితి ప్రతినిధులు

స్టేషన్ మహబూబ్‌నగర్: హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో ఈనెల 9వ తేదీన నిర్వహించనున్న బ్రహ్మగర్జనకు ఉమ్మడి జిల్లాలోని బ్రాహ్మణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బ్రాహ్మణ సేవా సమితి నాయకులు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో గురువారం బ్రహ్మగర్జన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రాహ్మణుల హక్కులు, ఆత్మగౌరవ కోసం భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2003లో హైదరాబాద్‌లో బ్రహ్మగర్జన నిర్వహించి బ్రాహ్మణులకు ఎన్నో పథకాలను సాధించుకున్నట్లు పేర్కొన్నారు. కరణీక వ్యవస్థను అప్పుడు అధికారంలో ఉన్న పార్టీ రద్దు చేసి లక్షలాది బ్రాహ్మణులకు నష్టం చేసిందన్నారు. నిరంతరం ప్రజలకు సేవ చేయడానికి తిరిగి కరణీక వ్యవస్థను, దేవాలయాల కమిటీల్లో బ్రాహ్మణులకు తగిన ప్రాధాన్యత సాధించుకోవడం కోసం సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభకు దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి పార్టీలకతీతంగా బ్రాహ్మణ పెద్దలు, నాయకులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ డైరెక్టర్ జ్యోషి గోపాలశర్మ, బ్రాహ్మణ సేవా సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి రాఘవేంద్రశర్మ, శ్రీకాంత్ శర్మ, శ్రీధర్‌రావు, చంద్రకాంతాచార్యులు, శ్రీకాంత్ శర్మ, రమేశ్‌శర్మ, నాగరాజుశర్మ పాల్గొన్నారు.

ముగ్గురి సెల్‌ఫోన్ల అప్పగింత

అడ్డాకుల: మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న ముగ్గురికి పోలీసులు రికవరీ చేసి అందజేశారు. మండలంలోని కందూర్ చెందిన కొండన్న, మల్లికార్జున్, రాచాల చెందిన షాహిల్ వేర్వేరు రోజుల్లో తమ మొబైల్ ఫోన్లను పొగొట్టుకున్నారు. ఐఎంఈఐ నంబరుతో సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితులను గురువారం పోలీస్‌స్టేషన్‌లో వారి ఫోన్లను అప్పగించినట్లు ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపారు. మొబైల్ ఫోన్లను పొగొట్టుకున్న వారు వెంటనే ఐఎంఈఐ నంబరుతో సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసి తమకు ఫిర్యాదును అందజేయాలని ఎస్‌ఐ సూచించారు.



ఫోన్లను అప్పగిస్తున్న ఎస్‌ఐ మాధవరెడ్డి

సమాధి విషయంలో ఇరువర్గాల ఘర్షణ

మిడ్జిల్: మండలంలోని రాణిపేట్‌లో బోయ జంగమ్మ (70)అనారోగ్యంతో బుధవారం సాయంత్రం మృతి చెందింది. వారి కుటుంబ సభ్యులు గ్రామ సమీపంలో గతంలో సమాధులు పెట్టిన చోట గురువారం ఉదయం గొయ్యి తీసేందుకు ప్రయత్నించారు. కాగా ఆ భూ యజమాని రాహుల్ కుటుంబ సభ్యులు తమ పట్టా భూమిలో సమాధులు ఎలా పెడుతారని అడ్డుకున్నారు. విషయం జడ్చర్ల రూరల్ సీఐ జములమ్మ, తహసీల్దార్ రాజీవ్‌రెడ్డి, ఎంపీపీ సుదర్శన్, ఎస్‌ఐ రామ్‌లాల్‌నాయక్ సంఘటన స్థలానికి వెళ్లి నచ్చజెప్పారు. పట్టా భూమిలో సమాధి పెట్టడం సరికాదని, అందులో కోర్టులో వివాదం ఉన్నందున పొలంలోకి వెళ్లకూడదని సూచించారు. దీంతో వారు సొంతభూమిలో సమాధి పెట్టుకోవడంతో సమస్య సద్దుమనిగింది.



సర్దిచెబుతున్న పోలీసులు

అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరిక



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

భూత్పూర్: సీఎం కేసీఆర్ చేపట్టే అభివృద్ధి పనులకు ఆకర్షితులై బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని అన్నాసాగర్‌లోని క్యాంపు కార్యాలయం కౌకుంట్ల మండలం తిరుమాలాపూర్ చెందిన పలువురు ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు. వెడ్డ ఎల్లప్ప, రాములు, ఖాదర్, కురుమూర్తి, వడ్ల శివయ్య, శ్రీనులతో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీకి చెందిన వారిని ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

చెక్కు అందజేత

అన్నాసాగర్‌లో గురువారం సీఎం సహాయ నిధి ద్వారా జక్కుల వెంకటేష్‌కు రూ.4లక్షలు మంజూరు కాగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చెక్కు అందజేశారు.

దివ్యాంగుడి నుంచి రూ.20 లక్షల కాజేసిన కి'లేడీ'

మహబూబ్‌నగర్ క్రైం: ఆన్‌లైన్ ద్వారా పరిచయం పెంచుకుని.. నిత్యం ఫోన్ కాల్స్ మాట్లాడుతూ ఓ దివ్యాంగుడి నుంచి భారీస్థాయిలో డబ్బులు వసూలు చేసింది ఓ కిలాడి అమ్మాయి. మాటలతో మాయ చేసి అవసరాలు సాకుగా చూపి రూ.లక్షల్లో దండుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రానికి చెందిన ఓ అంధ యువకుడు బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడు. సదరు యువకుడికి ఆరు నెలల కిందట ఆన్‌లైన్‌లో ఓ అమ్మాయి పరిచయమైంది. నిత్యం యువకుడితో ఫోన్‌లో మాట్లాడుతుండేది. ఈ క్రమంలో అవసరం ఉందని చెప్పి పలు ధపాలుగా సదరు యువకుడి నుంచి రూ.20 లక్షలు కాజేసింది. ఈ వ్యవహారం గమనించిన యువకుడి తండ్రి మోసపోయామని గుర్తించి గురువారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

స్కూల్ స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలి


జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ప్రభుత్వ స్కూళ్లలో పని చేస్తున్న స్వీపర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని స్కూల్ స్వీపర్ల సంఘం నాయకుడు బాలగౌడ్ డిమాండ్ చేశారు. తమను రెగ్యులర్ చేయాలనే డిమాండ్‌తో ధర్నా చౌక్‌లో చేస్తున్న రిలే దీక్షలు గురువారం 11వ రోజు కొనసాగాయి. ఆయన మాట్లాడుతూ.. కనీస వేతనం రూ.27వేలు ప్రతి నెల ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో గట్టన్న, రజాక్, బుచ్చన్న, చంద్రాయుడు, నాగమణి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని వినతి

బాలానగర్: మండలంలోని పెద్దాయపల్లి శివారులో నిర్మిస్తున్న డబుల్ బెడ్రూం ఇళ్లు త్వరగా పూర్తి చే యాలని గురువారం సర్పంచ్ శంకరప్ప ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. పెద్దాయపల్లి, సేరిగూడ మీదుగా బోడ జానంపేట్ వెళ్లేందుకు వీలుగా దుందుబీ నదిపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరినట్లు ఆయన పేర్కొన్నారు.

13న కాజీంపాష ఖాద్రీ ఉర్సు

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రముఖ మత గురువు, హైదరాబాద్‌కు చెందిన షహెజాదే గౌసే ఆజం హజ్రత్ పీర్ సయ్యద్ కాజీంపాష ఖాద్రీ రహెమతుల్లా అలై తృతీయ ఉర్సు ఈనెల 13న నిర్వహిస్తున్నట్లు బజ్మే అంజుమనే ఖాద్రియ కాజ్మియా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జహంగీర్‌పాష ఖాద్రీ తెలిపారు. జిల్లా కేంద్రం వీరన్నపేటలోని ఆమేనా మసీద్‌లో గురువారం ఉర్సు సంబంధించిన పోస్టర్లను మౌలానా ఆబిద్ హుస్సేన్, మౌలానా ఇఫ్తెకార్ అహ్మద్‌లు ముఖ్య అతిథులుగా హాజరై ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ వేడుకలు పీఠాధిపతి హజ్రత్ సయ్యద్ ఆలే ముస్తఫా ఖాద్రీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 13న సాయంత్రం 5 గంటలకు ఖాన్‌ఖాయే మూసాఖాద్రీ నివాసం నుంచి దర్గా షరీఫ్ వరకు ఊరేగింపు, సాయంత్రం 7 గంటలకు గంధోత్సవం నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం దర్గాలో పూలు, చాదర్లు సమర్పించి ప్రత్యేక ఫాతేహాలు ఇస్తారని తెలిపారు. రాత్రి 9 గంటలకు జల్సాయే ఫైజానే కాజ్మియా, 11 గంటలకు నాథియా ముషాయిరా ఉంటుందని తెలిపారు. జిల్లా కేంద్రం నుంచి వెళ్లేవారికి ఆ రోజు మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక అబ్దుల్ ఖాదర్ దర్గా నుంచి వాహనాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మతపెద్దలు